సాక్షి నిజామాబాద్

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



దసరా స్పెషల్ బస్సులు

నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఆరు డిపోల నుంచి బతుకమ్మ, దసరా పండుగలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

- IIలో ▸



జిల్లా గ్రంథాలయాన్ని..

జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆధునీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
36.7 /22.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఇందిరమ్మ మైనారిటీ మహిళా యువజనకు దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో అర్హులైన వారు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యువజనకు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక మద్దతు పథకం ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఒంటరి మహిళలు, వితంతువు, విడాకులు తీసుకున్న వారు, అనాథ మహిళలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళలకు రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. 21 నుంచి 51 సంవత్సరాల వయసు ఉన్న మహిళలు, ఆధార్, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను అక్టోబర్ 6వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

- డీఎంహెచ్‌వో రాజశ్రీ



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ చాంబర్‌లో శనివారం కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం సిబ్బందితో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు గ్రామస్థాయి నుంచి ప్రణాళికలు రచించాలన్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం గృహ సందర్శన చేసి అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వలను తొలగించడం, ఆయిల్ బాల్స్ వేయడం, డెంగీ పాజిటివ్ వచ్చిన ఇంటితోపాటు పరిసరాల్లో యాంటీ లార్వా మెజర్స్ చేపట్టాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తుకారాం రాథోడ్, అధికారులు, పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు



మాక్లూర్: జిల్లాలో యూరియా కొరత లేదని, అవసరమయ్యే రైతులు ఆయా సొసైటీల గోదాముల నుంచి తీసుకెళ్లాలని జిల్లా వ్యవసాయ అధికారి మేకల గోవింద్ పేర్కొన్నారు. ప్రధానంగా మాక్లూర్, ఆలూర్ మండలాల్లో సీజన్ ప్రారంభం నుంచి యూరియా పుష్కలంగా ఉందన్నారు. మండలంలోని కల్లెడి వ్యవసాయ పరపతి సంఘం ఎరువుల గోదాంను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. అధిక యూరియా వాడకంతో అనర్థాలున్నాయని తెలిపారు. పొట్ట దశలో యూరియా అధిక మోతాదులో వాడటంతో వరి గనేలో యూరియా గుళికలు చిక్కుకొని మొక్క తీపి పదార్థంగా మారుతుందన్నారు. ఫలితంగా పురుగు చేరి వరి గనేను తొలిచి వేస్తుందన్నారు. రైతులు ఈ విషయాన్ని గ్రహించి వరి కరుగులో ఉన్నప్పుడే యూరియా చల్లి నిలిపివేయాలని సూచించారు. రైతులు నానో యూరియాపై దృష్టి పెట్టాలన్నారు. కల్లెడి గ్రామానికి త్వరలో రైతు వేది కను మంజూరు చేయిస్తామని హామీఇచ్చా రు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి దేగ పోశెట్టి, నాయకులు నీలగిరి శ్రీనివాస్, గంగారాం, మచ్చర్ల రమేశ్, మహేశ్, శివ, ధర్మయ్య, కృష్ణ, విఠల్, శ్రీను, నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

దసరా సెలవులు షురూ..


నిజామాబాద్ అర్బన్: పాఠశాలలకు దసరా సెలవులు ప్రారంభం అయ్యాయి. విద్యార్థులకు శనివారం పరీక్షలు ముగిసిన వెంటనే సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 5న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయి. దీంతో హాస్టళ్లలోని విద్యార్థులు ఇంటిబాట పట్టారు. మాక్లూర్ మండలం దాస్‌నగర్‌లోని గురుకుల వసతి గృహం వద్ద కిలో మీటర్ల పొడవున ట్రాఫిక్ స్తంభించిపోయింది. గురుకుల అధికారులు వాహనాలను లోనికి అనుమతించలేదు. దీంతో రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

సండే స్పెషల్

పూల పండుగ

ప్రకృతిని, పూలను దేవతలుగా కొలిచి ఆరాధించే పండుగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. నేలతో.. నీటితో మనుషులకు ఉన్న అనుబంధాన్ని చాటేది బతుకమ్మ. అటవీ ప్రాంతాలు, పొలాల్లో సహజ సిద్ధంగా పూసే పూలను సేకరించి బతుకమ్మగా తీర్చిదిద్దుతారు. ఈ వేడుకలతో ఊరూవాడా కళకళలాడుతుంది. పూల రంగుల మేళవింపుతో ప్రతి ఊరూ బతుకమ్మ పూదోటగా గుబాళిస్తుంది. తొమ్మిది రోజులపాటు ఆటలాడి, పాటలు పాడుతూ పూలను నీటిలో వదులుతారు. ఆదివారం నుంచి జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

– నిజామాబాద్ అర్బన్



- తొమ్మిది రోజులు గౌరమ్మకు పూజలు
- పూలను కొలిచే అరుదైన ఉత్సవం
- నేటి నుంచి బతుకమ్మ ఉత్సవాలు షురూ
- ప్రతిరోజు బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సంబురాలు

ఆశ్వయుజ మాసం శుద్ధ పాడ్యమి రోజు నుంచి వరుసగా తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను జరుపుకుంటారు. తంగేడు, గునుగు పూలు, బంతి, చామంతి పూలు, కట్ల పువ్వు, తామెర, దోస పువ్వు, గడ్డిపువ్వు వంటి పలు రకాల పూలను ఒక పళ్లెం, తాంబూలం, వెదురు బుట్టలో ఎత్తుగా పేర్చి పైన పసుపుతో చేసిన గౌరమ్మను పెట్టి చుట్టూ దీపాలతో అలంకరిస్తారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ పాటలు పాడుతారు. ఆ తర్వాత బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం తర్వాత తెచ్చుకున్న ప్రసాదాలు ఒకరికొకరు పంచుకుంటారు. గౌరమ్మను పవిత్రంగా భావించి ఆ పసుపును తమ మంగళ సూత్రాలకు రాసుకుంటారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ చివరిదైనా సద్దుల బతుకమ్మను జరుపుకుంటారు. ఆరవ రోజు బతుకమ్మ ఆడకుండా అర్రెం నిర్వహిస్తారు. శివుడి భార్య పార్వతికి మరో పేరు గౌరమ్మ. తొలిరోజు శివాలయాల్లో బతుకమ్మ ఆడుతారు. ఈ పండుగతో మాంగళ్యబలం, సంపద, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయన్నది విశ్వాసం.

దసరా తర్వాత..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో దసరా తర్వాత బతుకమ్మ పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రధానంగా ఎడపల్లి, బాల్కొండ, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి మండలాల్లో దసరా అనంతరం పౌర్ణమికి ముందు మంచిరోజున బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తారు. దసరాకు ముందు బతుకమ్మ నిర్వహిస్తే ఆడబిడ్డలు అత్తవారింటి నుంచి వచ్చే వీలుండదు. అందుకోసమే దసరా తర్వాత నిర్వహిస్తారని చెబుతుంటారు.

26న అలీసాగర్‌లో అధికారికంగా..

తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసింది. ఈ నెల 26న ఎడపల్లి మండలం అలీసాగర్ ప్రాంతంలో బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహించనుంది. ఉత్సవాలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

తొమ్మిది రోజులు..

మొదటి రోజు: ఎంగిలిపూల బతుకమ్మ
నువ్వులు, నూకలు నైవేద్యంగా సమర్పిస్తారు.

రెండవ రోజు : అటుకుల బతుకమ్మ
ఉడకబెట్టిన పప్పు, బెల్లం, అటుకులు నైవేద్యంగా సమర్పిస్తారు.

మూడో రోజు: ముద్దపప్పు బతుకమ్మ
ముద్ద పప్పు, పాలు, బెల్లం నైవేద్యంగా సమర్పిస్తారు.

నాలుగవ రోజు: నానబియ్యం బతుకమ్మ
నాన బెట్టిన బియ్యం, పాలు, బెల్లం సమర్పిస్తారు.

ఐదవ రోజు : అట్ల బతుకమ్మ
అట్లు సమర్పిస్తారు.

ఆరో రోజు: అలిగిన బతుకమ్మ
(విరామం ప్రకటిస్తారు)

ఏడవ రోజు: వేపకాయల బతుకమ్మ
బియ్యం పిండిని వేపపండ్ల ఆకారంలో నైవేద్యంగా సమర్పిస్తారు.

ఎనిమిదో రోజు: వెన్నముద్దల బతుకమ్మ
వెన్న, నువ్వులు, బెల్లం నైవేద్యంగా సమర్పిస్తారు.

తొమ్మిదవ రోజు: సద్దుల బతుకమ్మ
సత్తు పిండి, నువ్వుల పిండి, బెల్లం నైవేద్యంగా సమర్పిస్తారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

రాష్ట్ర ప్రభుత్వం 'బతుకమ్మ'ను రాష్ట్ర పండుగగా 2014 జూన్ 16న ప్రకటించి అప్పటి నుంచి ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహిస్తోంది. బతుకమ్మ సంబురాలు జిల్లాలో ఉత్సాహంగా నిర్వహిస్తారు. పలు శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, కలెక్టర్ కార్యాలయంలో సైతం బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. రఘునాథ చెరువు, పులాంగ్ వాగు, కంఠేశ్వర్ ఆలయం, కనకమహాలక్ష్మి ఆలయం, సాయిబాబా ఆలయం, బోర్గాం (పి) గ్రామంలో పెద్ద ఎత్తున మహిళలు బతుకమ్మ ఆడతారు. గ్రామీణ ప్రాంతాలలో సాయంత్రం వేళ మహిళలు ఆటపాటలతో హోరెత్తిస్తారు. అనంతరం సమీప చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ పండుగ సందర్భంగా బల్దియా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సంబురంగా జరిపేవాళ్లం



నా చిన్నతనంలో బతుకమ్మను సంబురంగా జరిపేవాళ్లం. అడవిలోంచి తెచ్చిన తంగేడు పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేసేవాళ్లం. ఆ రోజుల్లో సామూహికంగా, ఎంతో ఉత్సాహంగా నిర్వహించేవాళ్లం. – ప్రభాదేవి, ముబారక్‌నగర్

నేటితరానికి అందించాలి



భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేటితరానికి అందేలా చూడాలి. బతుకమ్మ అంటేనే బతుకును ఇచ్చే పండుగ. పూలను పూజించే సంస్కృతి కేవలం తెలంగాణకే సొంతం. ఇలాంటి అరుదైన సంస్కృతిని భావితరాలకు అందించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– విజేత, ఆర్టీసీ కాలనీ

ఎంతో సంబురం



ఆడపడచులు జరుపుకునే అరుదైన పండుగ బతుకమ్మ. అత్తగారింటి నుంచి తల్లిగారింటికి వచ్చి గౌరమ్మను పూజించి పండుగను ఉత్సాహంగా జరుపుకుంటాం. ప్రతిసారి నేను మా తల్లిగారింటికి వచ్చి బతుకమ్మ పండుగను జరుపుకుంటాను.

– మహాలక్ష్మి, బర్దిపూర్

భూసేకరణ త్వరితంగా పూర్తిచేయాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పక్కన డీఎఫ్‌వో వికాస్ మీనా, సబ్ కలెక్టర్లు

- జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు అప్పగించాలి
- వీసీలో సీఎస్ రామకృష్ణారావు

నిజామాబాద్ అర్బన్: జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనుల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో భూసేకరణ అంశంపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి పనులకు అవసరమైన భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను జిల్లాల వారీగా చర్చించారు. జాతీయ రహదారుల నిర్మాణాలు, విస్తరణ పనులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో భూసేకరణ అంశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సీఎస్ సూచించారు. ఇప్పటికే పరిహారం చెల్లింపు పూర్తయిన భూమిని స్వాధీనం చేసుకోవాలని, అభ్యంతరాలు ఉన్న వారితో మాట్లాడి భూసేకరణకు సహకరించేలా చూడాలన్నారు. జాతీయ రహదారి సంస్థకు భూములు స్వాధీనం చేయాలని ఆదేశించారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులు సిద్ధంగా ఉన్నాయని, పనులు చేపట్టేందుకు కాంట్రాక్ట్ ఏజెన్సీలు సైతం సమాయత్తమైనందున యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేలా చొరవ చూపాలన్నారు.

74 హెక్టార్ల భూమికి అవార్డు పూర్తి..

జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనుల కోసం జిల్లాలో ఇప్పటికే 74 హెక్టార్ల భూమికి సంబంధించి అవార్డు ప్రక్రియ పూర్తయ్యిందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సీఎస్ దృష్టికి తెచ్చారు. కోర్టు స్టే కారణంగా మరో 19.3 హెక్టార్ల భూ సేకరణ ప్రక్రియ నిలిచిందని, ఇటీవలే కోర్టు స్టే తొలగిందని, సత్వరమే భూసేకరణను పూర్తి చేస్తామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎఫ్‌వో వికాస్ మీనా, బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ట్రెయినీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతివల్లో అక్షర జ్యోతులు

- ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ అడ్మిషన్లు
- జిల్లాలో 5,861 మందికి అడ్మిషన్ల లక్ష్యం
- మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ సంకల్పం



దొన్కల్ క్లస్టర్ వీవోఏల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం శ్యామ్ (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ఆర్థిక పరిస్థితులు, కుటుంబ బాధ్యతలు తదితర కారణాలతో చాలా మంది మహిళలు చదువును అర్ధంతరంగా ఆపేశారు. అటువంటి మహిళల్లో అక్షరజ్యోతులు వెలిగించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా ప్రాథమిక, ప్రాథమికోన్నత చదువులు చదివి మధ్యలోనే డ్రాపౌట్స్‌గా మారిన మహిళలకు ఓపెన్ టెన్త్‌లో అడ్మిషన్లు ఇప్పిస్తున్నారు. పది పాసైన వారు ఇంటర్ చదువుకోవడానికి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పిస్తూ ఉన్నత విద్యావంతులుగా తయారు చేయడానికి సన్నద్ధం చేస్తున్నారు.

24,179 మహిళా సంఘాలు..

జిల్లాలో 28 మండల సమాఖ్యలు, 806 గ్రామ సమాఖ్యలు ఉండగా 24,179 మహిళా సంఘాలు ఉన్నాయి. ఇందులో 2,53,678 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో అర్హత ప్రకారం ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ చదవడంతో భవిష్యత్తులో కలిగే లాభాలను వివరిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి మహిళా సంఘాల ద్వారా ఓపెన్ స్కూల్‌లో 5,861 మంది అడ్మిషన్లు తీసుకోవడమే లక్ష్యంగా నిర్ణయించారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 4,364 మందికి అడ్మిషన్లు ఇప్పించారు. మరో 1,497 మందిని చేర్పించాల్సి ఉంది. ప్రతి గ్రామ సమాఖ్య నుంచి కనీసం ఐదు నుంచి పది మందికి ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ఇప్పించడానికి క్షేత్రస్థాయి ఉద్యోగులు కృషి చేస్తున్నారు. కాగా, ఇప్పటి వరకు తీసుకున్న అడ్మిషన్లలో 70 శాతానికి పైగా పదో తరగతి వారే ఉన్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి.



ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

అక్షరాస్యతను పెంపొందించేందుకే..

మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించడానికి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ఇప్పిస్తున్నాం. అన్నిచోట్ల సంఘాల సభ్యులు పది, ఇంటర్‌లలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నెల 24వరకు లక్ష్యానికి అనుగుణంగా అడ్మిషన్లు పూర్తి చేయిస్తాం.

– సాయాగౌడ్, డీఆర్డీవో

పండుగకు పోదాం చలో.. చలో..



విద్యాసంస్థలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు సొంతూళ్లకు పయనమయ్యారు. శనివారం నగరంలోని బస్టాండ్ విద్యార్థులతో కిటకిటలాడింది. బస్సుల కోసం ఎదురు చూసుకుంటూ సీట్ల కోసం పరుగులు పెట్టారు. కొందరు కిటికీల నుంచి దూరి సీట్లను దక్కించుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





ఇంటికి బయల్దేరిన విద్యార్థులతో నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో సందడి వాతావరణం





క్లుప్తంగా

దేవి మండపాలకు పట్టుచీరల పంపిణీ



నిజామాబాద్ రూరల్: నగరంలోని దేవిమాత మండపాలకు పట్టుచీరలను పంపిణీ చేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని మార్వాడి గల్లీ డీఎన్‌టీ కార్యాలయంలో శనివారం ధన్‌పాల్ లక్ష్మీబాయ్–విఠల్‌గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టుచీరల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే ధన్‌పాల్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలోని దాదాపు 250 మండపాలకు పట్టుచీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత 11 ఏళ్ల నుంచి తన ట్రస్ట్ ద్వారా ఈ సేవ కార్యక్రమాలతో పాటు హిందూ పండుగలకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు ఉదయ్ కుమార్, ప్రణయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌లో ఉన్న ఎస్సైలకు పోస్టింగ్‌లు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీఆర్‌లో ఉన్న తొమ్మిది మంది ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇస్తూ సీపీ సాయిచైతన్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్మూర్‌లో ఎస్సైగా ఉన్న గోవింద్‌ను, వీఆర్‌లో ఉన్న మహేష్‌లను సీసీఎస్, నిజామాబాద్‌కు బదిలీ చేశారు. అలాగే మహేష్‌ను వీఆర్ నుంచి ఒకటో టౌన్‌కు బదిలీ చేయగా ఇక్కడ పని చేస్తున్న మొగులయ్యను మాక్లూర్ పీఎస్–2 ఎస్సైగా బదిలీ చేశారు. సౌత్‌రూరల్‌లో పని చేస్తున్న సామ శ్రీనివాస్‌ను నిజామాబాద్ రూరల్–2 ఎస్సైగా, వీఆర్‌లో ఉన్న వినయ్ కుమార్‌ను ఆర్మూర్ పీఎస్‌కు, సాయన్‌గౌడ్‌ను వీఆర్ నుంచి సీఎస్‌బీకి బదిలీ చేశారు. బదిలీ అయిన వారు పీఎస్‌లో రిపోర్టు చేయాలని సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి పదోన్నతులు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్‌లో పలువురు కండక్టర్, ఏడీసీలు, హెల్పర్లకు పదోన్నతులు లభించాయి. నిజామాబాద్ బస్టాండ్‌లోని ఆర్‌ఎం కార్యాలయంలో పదోన్నతులు పొందిన సుమారు 30 మందికి శనివారం సంబంధిత పత్రాలను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో పీవో పద్మావతి తదితరులు ఉన్నారు.

దసరా స్పెషల్ ధరలు బస్సులు

- నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో అదనంగా 388 బస్సులు ఏర్పాటు
- టికెట్ ధరపై 50శాతం పెంపు
- ఈనెల 20 నుంచి అక్టోబర్ 1 వరకు నడుపనున్న ఆర్టీసీ అధికారులు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఆరు డిపోల నుంచి దసరా, బతుకమ్మ పండుగలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. శనివారం నుంచి పాఠశాలలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో ప్రయాణికులకు ఇక్కట్లు కలుగకుండా ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు. కానీ స్పెషల్ బస్సులకు అదనపు చార్జీలు వసూలు చేయడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. టిక్కెట్ ఛార్జీపై ఆర్టీసీ వారు అదనంగా 50శాతం వసూలు చేస్తున్నారు. దీంతో నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుడికి సుమారు రూ.150 అదనంగా పడుతుంది. మహలక్ష్మీ పథకంలో మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించగా, అధనపు చార్జీలతో పురుషులకే ఇబ్బందిగా మారింది.

నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్‌కు..

నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్‌కు ప్రతిరోజు 185 బస్సులు నడిపిస్తారు. పండుగల నేపథ్యంలో ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉంది. దీంతో శనివారం నుంచే నిజామాబాద్ రీజియన్ నుంచి సికింద్రాబాద్‌కు అదనపు బస్సులు నడిపిస్తున్నారు. దసరా పండుగకు మొత్తంగా 388 (ఆపరేషన్ 36, నాన్ ఆపరేషన్ 352) ప్రత్యేక బస్సులు నడిపించడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఈనెల 20 నుంచి 25 వరకు నిత్యం 40 అదనపు బస్సులు నడుపనున్నారు. 26న 50, 27న 80, 28న 68, 29న 50, 30న 50, 1న 50 బస్సులను నడుపనున్నారు. నేడు ఆదివారం అమావాస్య కావడంతో ప్రయాణికులను బట్టి బస్సులను అందుబాటులో ఉంచనున్నారు.

ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం..

జేబీఎస్ నుంచి నిజామాబాద్‌కు ఆర్టీసీ అధికారులు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఇప్పటికే తిరుపతి, ఒంగోలు, పాలమూరు తదితర ప్రాంతాలకు వెళ్లడానికి రిజర్వేషన్ ఉంది. అయితే పండుగల సందర్భంగా ప్రయాణికులు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవడం ద్వారా సౌకర్యవంతంగా ఇబ్బందులు లేకుండా ప్రయాణించవచ్చు. టికెట్ బుకింగ్ కోసం ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్ tgsrtcbus. in లేదా TGRTC మొబైల్ యాప్‌లో అందుబాటులో ఉంచారు.

సద్వినియోగం చేసుకోవాలి



పండుగల సందర్భంగా నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచాం. జేబీఎస్‌లో డిపోల వారిగా ప్రత్యేక ఆఫీసర్‌లను ఏర్పాటు చేశాం. దీంతో ప్రయాణీకులు ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుంది. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. –జ్యోత్స్న, ఆర్టీసీ ఆర్‌ఎం, నిజామాబాద్

జ్ఞాపకాలు ఏవైనా చెరిపేస్తోంది

- మానవాళి మౌనశత్రువు అల్జీమర్స్ వ్యాధి
- నేడు వరల్డ్ అల్జీమర్స్ డే



నిజామాబాద్‌నాగారం: అల్జీమర్స్ వ్యాధి సోకిన వ్యక్తులు జ్ఞాపకశక్తిని కోల్పోవడంతోపాటు, తనవారిని గుర్తుపట్టలేని స్థితికి చేరుకుంటారు. ఇలాంటి వ్యాధికి పూర్తిస్థాయి చికిత్స ప్రస్తుతం అందుబాటులో లేకపోయినా, వ్యాధి తీవ్రతను తగ్గించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇలాంటి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న ప్రపంచ అల్జీమర్స్ దినం నిర్వహిస్తుంటారు. నేడు అల్జీమర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

సాధారణంగా వృద్ధాప్యంలో ఈ వ్యాధి కనిపిస్తుంది. ఈ వ్యాధి క్రమంగా జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తూ, వ్యక్తుల వ్యక్తిత్వం, ప్రవర్తన, రోజువారీ పనులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొదట చిన్న విషయాలు మరచిపోవడం, మాటలలో తడబడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తర్వాత దశల్లో, రోగి తన కుటుంబ సభ్యులను కూడా గుర్తుపట్టలేని స్థితికి చేరవచ్చు.

చికిత్సలు ఇలా..

ప్రస్తుత జీవనశైలిలో ప్రతి ఒక్కరిలో మానసిక ఒత్తిడి, నిరాశ, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు సాధారణంగా కనిపిస్తున్నాయి. ఈక్రమంలో మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపి, నిరాశ, ఆందోళన వంటి సమస్యలకు దారితీస్తుంది. దీంతో అల్జీమర్స్ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది.

ప్రస్తుతం అల్జీమర్స్‌ను పూర్తిగా నయం చేసే చికిత్స లేకపోయినా, లక్షణాలను తగ్గించి, వ్యాధి తీవ్రతను నియంత్రించే చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. చోలినెస్టరేస్ ఇన్హిబిటర్లు అంటాగనిస్ట్ వంటి మందులు జ్ఞాపకశక్తి, మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. అదనంగా మోనోక్లోనల్ యాంటీబాడీలు మెదడులో అమిలాయిడ్ ప్లాక్లను తొలగించడానికి ఉపయోగపడుతున్నాయి. కాగ్నిటివ్ రిహాబిలిటేషన్, మెమెరీ ట్రెనింగ్, ఫిజియోథెరపీ, మ్యూజిక్ థెరపీ, కౌన్సెలింగ్ వంటి మద్దతు చికిత్సలు కూడా రోగుల జీవన నాణ్యతను మెరుగుపరుస్తాయి. సమతుల్య ఆహారం, వ్యాయామం, తగిన నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటి ఆరోగ్యకర జీవనశైలి మార్పులు కూడా వ్యాధి ప్రగతిని నెమ్మదింపజేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

జాగ్రత్తలు ఇలా..

- ఫైబర్ అధికంగా ఉన్న పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు తీసుకోవాలి.
- ప్రోబయోటిక్స్ (పెరుగు, కిమ్చీ, ఇతర ఫెర్మెంటెడ్ ఆహారాలు), ప్రీబయోటిక్స్ (ఉల్లిపాయలు, వెల్లుల్లి, అరటిపండ్లు) గట్ సూక్ష్మజీవుల సంరక్షణకు సహాయపడతాయి.
- అధిక కొవ్వు, ప్రాసెస్డ్ ఫుడ్లు తగ్గించి, సమతుల్య ఆహారం తీసుకోవాలి.
- ప్రతిరోజూ మితమైన వ్యాయామం చేయాలి. ఇది రక్తప్రవాహాన్ని మెరుగుపరిచి, ఒత్తిడిని తగ్గిస్తుంది.
- తగినంత నిద్ర పొందడం ద్వారా మెదడు విశ్రాంతి తీసుకొని, జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది.
- ధ్యానం, యోగా మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.

ముందస్తు సంరక్షణే ప్రధానం



ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవం మనకు మానసిక, శారీరక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకునే మంచి అవకాశం ఇస్తుంది. అలాగే జీవనశైలి, ఆహారపు అలవాట్లను మెరుగుపరచడం, మానసిక, శారీరక ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అత్యవసరం. జ్ఞాపకాలను కాపాడుకోవాలంటే అవగాహన, ప్రేమ, ముందస్తు సంరక్షణే ప్రధాన ఆయుధాలు. –డా. గౌతమ్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, వినాయక ఆస్పత్రి, నిజామాబాద్

జిల్లా గ్రంథాలయాన్ని ఆధునీకరిస్తాం

- పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్
- నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటన





పాత డీఈవో కార్యాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న పీసీసీ చీఫ్.. విజేతలను అభినందిస్తున్న మహేష్ కుమార్

నిజామాబాద్ సిటీ: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆధునీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతమున్న భవనానికి అదనంగా స్థలం కేటాయిస్తానని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పాత డీఈవో కార్యాలయ స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డితో కలిసి గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉన్నందున అధునాతన వసతులతో నూతన భవనం నిర్మిస్తామన్నారు. పాత డీఈవో కార్యాలయ స్థలం నుంచి 40 శాతం స్థలం దీనికోసం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే మినీ డీఎస్సీ వేస్తామని హామీ ఇచ్చారు. పోలీసు, టీచర్ వంటి పలు ఉద్యోగాలు భర్తీచేస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ఓబీసీ నాయకుడు రాజనరేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు నగేష్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, గడల శ్రీరాములు, నరాల రత్నాకర్, విపుల్‌గౌడ్, సుభాష్ జాదవ్, ఆకుల మహేందర్ తదితరులున్నారు.

ఉత్తర తిరుమలలో ప్రత్యేక పూజలు..

నిజామాబాద్ రూరల్: నగరంలోని గంగాస్థాన్‌లో ఉన్న ఉత్తర తిరుమల క్షేత్రాన్ని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శనివారం సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ప్రాధాన అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాగేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తైక్వాండో పోటీల విజేతలకు అభినందన

నిజామాబాద్‌నాగారం: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మొదటి ఏషియన్ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో నిజామాబాద్ విద్యార్థులు ప్రతిభ చూపి, బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలు శనివారం నగరంలోని వినాయక్‌నగర్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిశారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. తైక్వాండో కోచ్ హీరాలాల్, మాస్టర్ సాకేత్, వినోద్ గౌడ్, యామిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అటవీ భూమి సరిహద్దులో కందకాలు ఏర్పాటు



అటవీప్రాంతానికి తరలివచ్చిన గ్రామస్తులు

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలం కులాస్పూర్ తండాలోగల అటవీ భూమిలో కందకాలను శనివారం ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న గిరిజనులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈక్రమంలో అటవీ భూమిలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తారేమోనని గిరిజనులు అటవీ అధికారులను అడ్డుకున్నారు. సమాచారం అందిన వెంటనే రూరల్ సీఐ సురేష్ కుమార్, ఎస్‌ఐ సుస్మిత సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఎఫ్‌ఆర్‌వో రాధిక, సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. ప్రస్తుతానికి అటవీ భూమిలో కందకాలు ఏర్పాటు చేశారు. మొక్కజొన్న పంట పూర్తయ్యాక ఆ భూమిలో నుంచి ట్రెంచ్ ఏర్పాటు చేస్తామని అటవీ అధికారులు తెలిపారు.

దూరవిద్యకేంద్రంలో ప్రవేశాలు

నిజామాబాద్ అర్బన్: ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి రామ్‌రెడ్డి దూరవిద్య కేంద్రంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కో–ఆర్డినేటర్, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, ఎంబీఏ ఎంసీఏ, ఎంఏ, ఎంఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిప్లొమ కంప్యూటర్ అప్లికేషన్స్, డేటా సైన్స్, వ్యాపార నిర్వహణ సర్టిఫికెట్, యోగా కోర్సులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆసక్తిగలవారు అక్టోబర్ 15లోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9912670252ను సంప్రదించాలన్నారు.

పట్టపగలే దారి దోపిడీ

- తల్లీకొడుకులను అడ్డుకుని ఆరు తులాల బంగారు నగలు అపహరణ
- దుండగుడి దాడిలో కొడుకుకు గాయాలు



బాధితురాలు సీతమ్మ

మద్నూర్(జుక్కల్): కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రానికి సమీపంలో శనివారం పట్టపగలే జరిగిన దారి దోపిడీ స్థానికంగా కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన మల్లయ్యగారి ఎల్లాగౌడ్, అతని తల్లి మల్లయ్యగారి సీతమ్మ కలిసి బైక్‌పై మద్నూర్‌లో జరిగే ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు బయలుదేరారు. మద్నూర్ సమీపంలో వారు జాతీయ రహదారి 161 నుంచి మద్నూర్ వైపునకు వచ్చే సర్వీస్ రోడ్డు పైకి రాగానే వెనకాల నుంచి బైక్‌పై హెల్మెట్‌లు ధరించిన ఇద్దరు వేగంగా వచ్చి తల్లీకొడుకులను అడ్డుకున్నారు. కత్తి తీసి బెదిరించి సీతమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలను ఇవ్వాలన్నారు. దీంతో సీతమ్మ కొడుకు ఎల్లాగౌడ్ అడ్డుకోగా తోపులాట జరిగింది. ఇద్దరు దుండగులలో ఒకరి హెల్మెట్ కింద పడిపోయింది. దీంతో దుండగుడు కత్తితో ఎల్లాగౌడ్‌పై దాడి చేసి చంపేస్తామని బెదిరించాడు. అప్పటికే ఎల్లాగౌడ్ చేతికి గాయం కావడంతో భయపడిన సీతమ్మ తన ఒంటిపై గల నాలుగు తులాల బంగారు నెక్లెస్, రెండు తులాల పుస్తెల తాడు దుండగులకు ఇచ్చేసింది. నగలను తీసుకుని వారు పారిపోయారు. సమాచారం అందుకున్న స్థానికులు తల్లీకొడుకులను మద్నూర్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. ఎస్సై విజయ్‌కొండ, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. ఈ దారి దోపిడీ ఘటనతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

చైన్ స్నాచింగ్ నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో ఇటీవల చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులను పట్టణ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 18న సాయంత్రం గాంధీనగర్‌కు చెందిన దండేపల్లి అనసూయ తన మనువడిని పాఠశాల నుంచి ఇంటికి తీసుకువస్తోంది. ఈక్రమంలో ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి 3తులాల బంగారం గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా బైక్ వివరాలను గుర్తించారు. నిందితులుగా రామేశ్వర్‌పల్లికి చెందిన భాస్కర్ రెడ్డి, బాబాగౌడ్‌లుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఏఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి చైన్‌ను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.

క్రైం కార్నర్

దుబాయిలో తిప్పాపూర్ వాసి మృతి



సుధాకర్ (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దుబాయిలో ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గొడుగు సుధాకర్ (38)ఇటీవల జీవనోపాధి కోసం దుబాయి దేశానికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి అతడు విధులు ముగించుకుని బంగ్లా పైనుంచి కిందకు వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే ఈ విషయం సుధాకర్ కుటుంబీకులకు ఫోన్ ద్వార సమాచారం రావడంతో వారి రోదనలు మిన్నంటాయి. సుధాకర్ మృతదేహన్ని స్వగ్రామానికి రప్పించేందుకు అక్కడ కార్మికులుగా పనిచేస్తున్న తిప్పాపూర్ వాసులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందించారు. ఈనెల 23న సుధాకర్ మృతదేహం తిప్పాపూర్ గ్రామానికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ ఒకరు..



అక్కారం రవి (ఫైల్)

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. మెండోరా ఎస్సై సుహాసిని తెలిపిన వివరాలు ఇలా.. మెండోరా మండల కేంద్రానికి చెందిన అక్కారం రవి(36) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనెల 16న ఇంట్లో భార్యతో గొడవ పడి ఆవేశంలో డీజిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే కుటుంబసభ్యులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



అజార్ (ఫైల్)

వర్ని: మండల కేంద్రంలోని వీఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రుద్రూర్ మండలం అక్బర్ నగర్ గ్రామానికి చెందిన అజార్ (25) శనివారం రాత్రి బైక్‌పై నిజామాబాద్ వైపు నుంచి వర్ని వైపు బయలుదేరాడు. వర్నిలోని వీఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్ద అతడిని నిజామాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ వెల్లడించారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృతి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి కరెంట్ షాక్‌తో ఆవు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని పాకాల జంగం లింగంకు చెందిన ఆవు తన వ్యవసాయ బావి వద్ద మేత మేస్తుండగా బోరు బావికి సంబంధించిన విద్యుత్ స్టాటర్ బాక్స్‌కు తగిలింది. దీంతో ఆవుకు కరెంట్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందన్నారు. విద్యుత్ అధికారులు, పశువైద్య సిబ్బంది శనివారం ఉదయం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని లింబూర్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు డోంగ్లీ ఆర్‌ఐ సాయిబాబా శనివారం తెలిపారు. పోతంగల్ మంజీర ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని, మద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎక్కడైన అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాయిల్స్, ఇతర ఉపకరణాలను దొంగలించారు. విషయం తెలుసుకున్న లిఫ్ట్ చైర్మన్ నర్సారెడ్డి రైతులతో కలిసి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.5లక్షలు విలువ చేసే ఉపకరణాలు దొంగలించడ్డాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మెడికల్ షాపులో తనిఖీలు



వర్ని: మండల కేంద్రంలోని మెడ్‌ప్లస్ మెడికల్ షాపులో శనివారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత తనిఖీలు నిర్వహించారు. ఇటీవల దుకాణంలోని ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌లో చెత్త రావడంపై బాధితులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు దుకాణాన్ని తనిఖీ చేసి, శాంపిల్స్ సేకరించారు. చెత్త వచ్చిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌తోపాటు ఆ బ్యాచ్‌కు సంబంధించిన ప్యాకెట్లు అన్నింటిని సీజ్ చేసి ల్యాబ్‌కు పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఈ బ్యాచ్‌కు చెందిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లన్నింటిని రాష్ట్ర వ్యాప్తంగా రీకాల్ చేయిస్తామని వెల్లడించారు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పాము కాటుతో బాలుడికి గాయం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి





బాలుడిని కాటేసిన కట్లపాము.. భాస్కర్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): కట్ల పాము కాటేయడంతో గాయపడ్డ బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన గంగుల రాజమణి– నర్సింలు దంపతులకు కూతురు, కుమారుడు గంగుల భాస్కర్(3) ఉన్నారు. ఈ నెల 12న రాజమణి పిల్లలతో కలిసి మహమ్మద్ నగర్‌లోని తన తల్లిగారింటికి వచ్చింది. ఈ నెల 17న ఇంట్లో వారు నిద్రించగా, అర్ధరాత్రి వేళ భాస్కర్ రోధించడంతో కుటుంబసభ్యులు నిద్రలేచారు. ఇంట్లో పరిశీలించగా వారికి కట్ల పాము కన్పించింది. దీంతో భాస్కర్‌ను కాటువేసిందని గుర్తించి పామును చంపి, బాలుడిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే పాము కాటుతో బాలుడు అపస్మారక స్థితికి చేరుకోవడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. బాలుడి మృతిపై తల్లిదండ్రులు నిజాంసాగర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించారు.

సిలిండర్ లీక్‌తో అగ్నిప్రమాదం



మద్నూర్(జుక్కల్): మండలంలోని రూసేగావ్‌కు చెందిన కాంబ్లే శంకర్ ఇంట్లో గ్యాస్ సిలెండర్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది, బాధితులు తెలిపిన వివరాలు ఇలా.. శంకర్ కుటుంబీకులు శనివారం ఉదయం ఇంట్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా సిలెండర్ నుంచి గ్యాస్ లీకవడంతోపాటు మంటలు అంటుకున్నాయి. వెంటనే ఇంట్లోని వారంతా బయటకు పరుగులు తీశారు. స్థానికులు మద్నూర్‌లోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైరింజన్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేకొని, మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 60వేల ఆస్తి నష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది తెలిపారు. ఇంట్లో ఉన్న తులం బంగారు నగలు, 15 తులాల వెండి వస్తువులు మంటల్లోంచి లీడింగ్ ఫైర్‌మెన్ తీసి ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్.. ఇళ్లపై తెగిపడిన విద్యుత్ వైర్లు



నవీపేట: మండల కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీలో విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ ఢీకొనడంతో పలువురి ఇళ్లపై 11 కేవీ కరెంట్ తీగలు తెగిపడ్డాయి. స్థానికులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా.. నవీపేటలో రైల్వేట్రాక్ నిర్మాణంలో భాగంగా భారీ టిప్పర్‌లు మొరం, కంకరలతో కాలనీ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈక్రమంలో శనివారం విద్యుత్ స్తంభానికి ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ తీగలు తెగిపోయి, కిందనున్న మూడు ఇళ్లపై పడ్డాయి. వెంటనే కాలనీవాసులు ఇళ్లలోని కుటుంబ సభ్యులను అప్రమత్తం చేశారు. ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి తీగలను సరి చేశారు.

పైపు లైన్‌కు భారీ లీకేజీలు

- ఎస్సారెస్పీ కాలనీ రోడ్లపై భారీగా ప్రవహిస్తున్న నీరు
- ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు


ప్రాజెక్ట్ కాలనీలో గల్లీ రోడ్లపై ప్రవహిస్తున్న నీరు


ఎస్సారెస్పీలో లీకేజీ అవుతున్న నీరు

బాల్కొండ: మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలనీకి ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే పైపులైన్‌కు భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో లీకేజీ నీరు కాలనీ రోడ్లపై కుంటల్లా నిలుస్తోంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి కాలనీకి నీటి సరఫరా కోసం ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో పైపు లైన్ వేశారు. ఆ పైపులు మట్టి సిమెంట్‌పైపు కావడంతో లీకేజీలకు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో లీకేజీ నీరు అధికంగా పోతోంది. పైపులైన్, సీసీ రోడ్ల మరమ్మతులను ప్రాజెక్ట్ అధికారులు గ్రామ పంచాయతీకి అప్పగించారు. కానీ ప్రస్తుతం ప్రాజెక్ట్, జీపీ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలోనే ఈ పనులను జీపీకి అప్పగించామంటూ ప్రాజెక్ట్ అధికారులు చెప్పారు. కానీ మా వద్ద మరమ్మతులకు నిధులు లేవంటు జీపీ అధికారులు పేర్కొంటున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. పైపు లైన్ మరమ్మతులకు కోసం తవ్విన గుంతల వల్ల ప్రమాదాలు జరిగే ప్రమాదం కూడా ఉంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జీపీ నుంచి మరమ్మతులు చేపట్టాలి

పోచంపాడ్ జీపీకి 2019లోనే వీటి నిర్వహణను అప్పగించాం. ప్రస్తుతం జీపీ అధికారులు తమకు సంబంధం లేదంటున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీ నుంచి మరమ్మతులు చేపట్టాలి. – అక్తర్, ఏఈఈ, ఎస్సారెస్పీ

అధికారికంగా అప్పగించలేదు

ప్రాజెక్ట్ కార్యాలయానికి సంబంధించిన పైపులైన్‌ను అధికారికంగా గ్రామ పంచాయతీకి అప్పగించ లేదు. సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించాను. ఉన్నత అధికారుల మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.
– భోజన్న, పంచాయతీ కార్యదర్శి, పోచంపాడ్

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్‌బీఐ డీజీఎం ఓమెన్

డిచ్‌పల్లి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎం సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ హైదరాబాద్ హెడ్ ఆఫీస్ డీజీఎం (ఎల్‌హెచ్‌వో సీసీవో) ఎంపీ ఓమెన్ సూచించారు. డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో శనివారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పీఎం జన్‌ధన్ ఖాతాలు, సాధారణ ఖాతాలు కలిగి ఉన్న ఖాతాదారులకు ప్రమాద బీమా, సాధారణ బీమా యోజన పథకాలపై ప్రతి గ్రామ పంచాయతీలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కేవలం రూ.20తో రూ.2లక్షల ప్రమాద బీమా, రూ.436తో రూ.2లక్షల సాధారణ బీమా సౌకర్యం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు బీమా యోజన పథకంలో చేరని వారుంటే వెంటనే పథకంలో చేరాలని సూచించారు. అలాగే చాలా కాలంగా లావాదేవీలు జరపకుండా ఉండే ఖాతాలు పనిచేయవని, వెంటనే వారు ఆధార్‌కార్డు, పాన్ కార్డులు బ్రాంచ్‌లో అందజేసి కేవైసీ పరిశీలన పూర్తి చేస్తే తిరిగి ఖాతా ద్వారా లావాదేవీలు జరుపవచ్చన్నారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ (నిజామాబాద్) కొల్లేటి మహేశ్వర్, నిజామాబాద్ ఏజీఎం (ఏవో) రంజిత్‌నాయుడు, చీఫ్ మేనేజర్ (ఏవో) రవికుమార్, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరక్టర్ రవి, డిచ్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ నిఖిత, సిబ్బంది, మాజీ సర్పంచ్ బూస సుదర్శన్, ఖిల్లా రామాలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో వైర్‌మన్ పరీక్ష


పాలిటెక్నిక్ కళాశాలలో వైర్‌మన్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వైర్‌మన్ అర్హతకు సంబంధించి జిల్లా వైర్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వైశాక్షి సంతోష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఎలక్ట్రిషన్ వైర్‌మన్ పర్మిట్ కలిగి ఉండాలన్నారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే ఎలక్ట్రికల్ వర్క్ చేయాలన్నారు. ప్రమాదాలను అరికట్టాలంటే పర్మిట్ ఉన్న ఎలక్ట్రిషన్‌లతోనే వర్క్ చేయించాలన్నారు. వైర్‌మన్ ఎగ్జామ్ రాసి పాస్ కావాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు రమేశ్, రాజు, అత్తర్, రఫీక్, మహమూద్ పాల్గొన్నారు.

జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లు

నిజామాబాద్‌అర్బన్: జర్నలిజం కోర్సులలో అడ్మిషన్ల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. కరస్పాండెంట్ విధానం ద్వార జర్నలిజంలో పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశం పొందవచ్చన్నారు. ఈ కోర్సులకు పదో తరగతి చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30లోపు దరఖాస్తులు చేసుకోవలన్నారు. కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషన్ క్యాంపస్, నారాయణగూడ, హైదరాబాద్‌లో సంప్రదించాలన్నారు. లేదా 9959640797ను సంప్రదించలన్నారు.

ఎమ్‌హెల్‌హెచ్‌పీలకు సర్టిఫికెట్ల అందజేత

నిజామాబాద్‌నాగారం: ఇటీవల కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లో చేరిన ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్)లు మూడు నెలల శిక్షణ పూర్తి చేసినందుకు శనివారం డీఎంహెచ్‌వో రాజశ్రీ వారికి సర్టిఫికేట్లు అందజేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత నిర్వహించిన మౌఖిక పరీక్షలో వారు ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించినట్లు తెలిపారు. దీనికి గానూ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా నిరూప్‌రెడ్డి, ప్రోగ్రామ్ అధికారి రవి విధులు నిర్వహించారు. మొత్తం 10 మంది హాజరయ్యారు.



అర్ధంతరంగా నిలిచిన పాఠశాల భవనాలు


హాజీపూర్‌లో నిలిచిన తరగతి గదుల నిర్మాణం

- ఒకే గదిలో అయిదు తరగతుల నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- హాజీపూర్, లింగంపల్లి తండాలలో నిధులు లేక నిలిచిన భవన నిర్మాణాలు

నస్రుల్లాబాద్: విద్యార్థులకు కనీసం కూర్చోవడానికి గదులు లేని పరిస్థితి ప్రభుత్వ పాఠశాలల్లో ఉంది. నస్రుల్లాబాద్ మండలంలోని హాజీపూర్, లింగంపల్లి గ్రామాల్లో కేవలం ఒక గది మాత్రమే ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులకు సరిపడా గదులు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు కాని బిల్లులు మంజూరు కాకపోవడంతో అర్ధంతరంగా నిలిచి పోయాయి. దీంతో ఒకే గదిలో 5 తరగతులకు చదువులు చెబుతున్నారు.



రాముల గుట్ట తండాలో వరండాలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

వరండాలో బోధన..
రాములుగుట్ట తండాల్లో చిన్నారులకు కేవలం ఒక గది మాత్రమే ఉండటంతో వరండాలో తరగతులను నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులు గుంపులుగా కూర్చొని చదువుకుంటున్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలను అందించినా కూడా అనుకున్న సంఖ్యలో విద్యార్థులు రావటం లేదు. దీనికి కారణం ఒకే గదిలో అందరికీ పాఠాలు చెప్పడమే. ఉన్నాతాధికారులు స్పందించి అదనపు తరగతి గదులను నిర్మాణం చేపట్టి చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలి.



జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు.. బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు


బస్సు కిటికీ నుంచి ఎక్కుతున్న యువకుడు

సందడిగా నగర బస్టాండ్

జిల్లాకేంద్రంలోని బస్టాండ్ శనివారం ప్రయాణికులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాలలోని విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లడానికి బస్సుల కోసం నగరంలోని బస్టాండ్‌కు భారీగా వచ్చారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



బస్టాండ్‌కు వస్తున్న విద్యార్థులు

సోలార్ ప్లాంట్స్‌పై సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

నిజామాబాద్ సిటీ: ఇళ్లపై సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని ఇస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ రవీందర్ అన్నారు. నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నగరంలో డిస్కం ఇంజినీర్లకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. శిక్షణలో పాల్గొన్న ఇంజినీర్లకు ఏఈలకు, సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఈ మాట్లాడుతూ.. సోలార్ ప్యానల్స్‌తో విద్యుత్ ఉత్పత్తి చేస్తే కిలోవాట్‌కు 85 కిలోల కార్బన్ మోనాక్సైడ్ వాతావరణంలోకి వెళ్లకుండా చేయగలుగుతామన్నారు. రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడం మూలంగా లైన్ లాసెస్‌ని తగ్గించుకోవచ్చన్నారు. కోటి గృహాలపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక్క కిలోవాట్‌కు రూ. 30వేల సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. 3 కిలోవాట్లకంటే ఎక్కువ వాటికి రూ. 78వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని వినియోగించుకొని రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్స్‌ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ భారతి, రిటైర్డు అధికారి దుర్గాప్రసాద్, నరేంద్ర కుమార్, అధికారులు వెంకటసుబ్బయ్య, అల్లాపూర్ రమేష్, పోశెట్టి, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.



అయోమయం


ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తి బండ్లు (ఫైల్)

- పత్తి రైతుల పరిస్థితి
- కొనుగోళ్లలో కపస్ కిసాన్ యాప్
- స్లాట్ బుకింగ్ విధానంలో..
- అమలు చేయాలంటున్న సీసీఐ
- తర్జనభర్జనలో మార్కెటింగ్ శాఖ

సాక్షి, ఆదిలాబాద్: పత్తి కొనుగోళ్లలో ఈ సీజన్ నుంచి ధర వ్యత్యాస చెల్లింపు పథకం (పీడీపీఎస్) ఆదిలాబాద్ మార్కెట్‌లో ప్రయోగాత్మకంగా అమలంటూ చర్చ సాగింది. ఇప్పుడు దానిపై ఊసే లేకుండా పోయింది. తాజాగా కపస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానంలో పత్తి కొనుగోళ్లు చేయాలంటున్నారు. తప్పనిసరిగా దీన్ని అమలు చేయాలని సీసీఐ చెబుతుండగా, దీని విషయంలో మార్కెటింగ్ శాఖ తర్జనభర్జనలో ఉంది. మరో వారంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏదైనా నిర్ణయం రావచ్చని అధికారులు అంటున్నారు. అయితే రైతులు మాత్రం అయోమయంలో ఉన్నారు. ఈ కొత్త విధానాలపై అవగాహన లేదని, రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు ముందుకెళ్లాలని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ మద్దతు అవసరం
ఈ సీజన్ నుంచి పత్తి సేకరణలో కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు అవసరమని సీసీఐ పేర్కొంటుంది. శుక్రవారం హైదరాబాద్‌లో 2025–26 సీజన్‌లో పత్తి సేకరణకు సంబంధించి సీసీఐ, రాష్ట్ర వ్యవసాయాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమావేశం నిర్వహించారు. సీసీఐ అధికారులు కొత్త విధానం అమలుపై మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పత్తి విక్రయించేందుకు కపస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు స్లాట్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోయిన సీసీఐ తప్పనిసరిగా దీన్ని అమలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తుంది.

కపస్ కిసాన్ యాప్

సీసీఐ కపస్ కిసాన్ యాప్‌ను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. పలు రాష్ట్రాల్లో క్రాప్ బుకింగ్ విధానం అమల్లో లేకపోవడంతో యాప్ రిజిస్ట్రేషన్ ఇప్పటికే మొదలుపెట్టారు. తెలంగాణలో క్రాప్ బుకింగ్ విధానం, రైతు సంబంధించిన వివరాలు ఉండటంతో యాప్ రిజిస్ట్రేషన్ అవసరం లేదని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే సీసీఐ చెబుతున్నట్లుగా ఈ యాప్ ద్వారానే కొనుగోళ్లు చేయాల్సి వచ్చిన పక్షంలో తప్పనిసరిగా రైతులు వారం ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. అలా అయితేనే మార్కెట్‌లో పత్తిని అమ్ముకునే పరిస్థితి.

రైతులకు ఇబ్బందికరం



స్లాట్ బుకింగ్ విధానంలో రైతులు పత్తిని అమ్ముకోవాలంటే ముందుగా ఆన్‌లైన్‌పై వారికి అవగాహన ఉండాలి. స్మార్ట్‌ఫోన్లు తప్పనిసరిగా ఉండాలి. మెజార్టీ రైతులు నిరాక్షరాస్యులకు అవగాహన లేదు. ఒకవేళ స్లాట్ బుకింగ్ చేసుకుంటే ఆ సమయానికి బండి దొరకకపోతే ఎలా.. ఇలాంటి అనేక సందేహాలు ఈ విధానంపై ఉన్నాయి.
– గోవర్ధన్ యాదవ్, రైతు సంఘం ప్రతినిధి, ఆదిలాబాద్

రైతుకు డబ్బులు అత్యవసరమైతే



పత్తి దిగుబడి వచ్చాక రైతు మార్కెట్‌లో అమ్మి తన అవసరాలకు డబ్బులు వినియోగిస్తారు. ఈరోజు డబ్బులు అవసరముంటే స్లాట్ వారం తర్వాత దొరికితే ఎట్లా. స్లాట్ బుకింగ్‌లో మూడు సార్లు క్యాన్సల్ అయితే నాలుగోసారి ఆ రైతుకు అవకాశం దొరకదని చెబుతున్నారు. ఇలాంటప్పుడు రైతు పత్తిని ఎక్కడ అమ్ముకోవాలి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సిగ్నల్ వ్యవస్థలు సరిగ్గా లేవు.
– రాజు చింతావార్, పత్తి వ్యాపారి, ఆదిలాబాద్

ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా



స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయాలని సీసీఐ కోరుతుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిర్ణయం రావాల్సి ఉంది. రాష్ట్రంలో క్రాప్ బుకింగ్ విధానం ఉండటంతో కపస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. నేరుగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయాలంటే మాత్రం చేయాల్సి వస్తుంది.
– గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఆదిలాబాద్

భూములన్నీ 'ప్రొహిబిటెడ్'

- 'ధరణి' తెచ్చిన సమస్య
- మూడు గ్రామాల రైతుల తిప్పలు..
- ఏళ్లుగా పరిష్కారం కానివైనం..
- భూ భారతితో సమస్య పరిష్కారం అయ్యేనా?

లక్ష్మణచాంద: రైతుల భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం 2020లో ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. అయితే, ఈ పోర్టల్ అమలుతో మండలంలోని న్యూ కంజర్, పొట్టపల్లి(బి), పొట్టపెల్లి(కె) గ్రామాల రైతుల భూములు 'ప్రొహిబిటెడ్'(అసైన్డ్) భూములుగా గుర్తించబడ్డాయి. దీంతో, ఈ గ్రామాల రైతుల పట్టా పాస్‌బుక్‌లలో భూమి స్వరూపం వద్ద 'అసైన్డ్ (ప్రొహిబిటెడ్)' అని ఆన్‌లైన్‌లో నమోదైంది. ఫలితంగా, 2020 నుంచి ఈ మూడు గ్రామాలలో భూముల క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి.

ఐదేళ్లుగా పరిష్కారం కాని సమస్య..
ధరణి పోర్టల్ అమలు తర్వాత మండలంలోని న్యూ కంజర్‌కు చెందిన 465 సర్వే నెంబర్లు, పొట్టపల్లి (బి)కి చెందిన 123 సర్వే నెంబర్లు, పొట్టపెల్లి (కే)కి చెందిన 40 సర్వే నెంబర్లు ప్రొహిబిటెడ్‌గా గుర్తించబడ్డాయి. మొత్త 628 సర్వే నంబర్లు ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చారు. ఏళ్ల తరబడి పరిష్కరించడం లేదు. సమస్య పరిష్కారం కోసం రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు అనేకసార్లు వెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో భూముల క్రయవిక్రయాలు నిరవధికంగా నిలిచిపోయాయి. రైతులు ఇబ్బంది పడుతున్నారు.


న్యూ కంజర్ గ్రామ పంచాయతీ భవనం

ఇవీ సర్వే నంబర్లు..

గ్రామం	సర్వే నంబర్
న్యూ కంజర్	465
పొట్టపల్లి(బి)	123
పొట్టపెల్లి (కె)	40

భూ భారతితో చిగురించిన ఆశలు..
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ధరణి పోర్టల్‌ను రద్దు చేసి, భూ భారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించింది. ఈ ప్రకటనతో రైతులలో ఆశలు చిగురించాయి. భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో సదస్సులు నిర్వహించారు. ఆగస్టు 15నాటికి అన్ని భూ సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు హామీ ఇచ్చారు. అయితే, ఈ మూడు గ్రామాల రైతుల సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు.

మంత్రులను కలిసినా ఫలితం లేదు..
ఈ మూడు గ్రామాల రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును స్థానిక నాయకులతో కలిసి విన్నవించారు. అయినా సమస్య ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంపై రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమ సమస్యను గుర్తించి, వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా..



మా భూ సమస్య పరిష్కరించాలని ఐదేళ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా. సమస్య పరిష్కారం కావడం లేదు. అసలు అవుతుందో లేదో అనే అనుమానం వస్తుంది.
– మంద సంజీవ్, రైతు న్యూకంజర్

ఇప్పడైనా పరిష్కరించాలి



భూ సమస్య పరిష్కారానికి ఐదేళ్లుగా తిరగని ఆఫీసు లేదు. కలువని అధికారి లేదు. అయినా మా సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పరిష్కరించాలి.
– ఎస్‌కే.సలీమ్, రైతు న్యూకంజర్

భూ సమస్య పరిష్కరిస్తాం



లక్ష్మణచాంద మండలం న్యూకంజర్, పొట్టపెల్లి(కె), పొట్టపల్లి (బి) గ్రామాల 648 సర్వే నంబర్ల భూ సమస్యను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలతో కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపడతాం. భూ భారతి ద్వారా అన్నదాతల సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడుతాం.
– కిశోర్‌కుమార్, అదనపు కలెక్టర్

అంగన్‌వాడీల నుంచి అక్రమ వసూళ్లు

- ఓ ప్రజాప్రతినిధి వద్ద పనిచేసే వ్యక్తి నిర్వాకం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి వద్ద పనిచేసే ప్రైవేట్ వ్యక్తి అక్రమ వసూళ్లకు తెరలేపాడు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగ విరమణ పొందిన టీచర్ల స్థానాల్లో అర్హులైన ఆయాలకు ఇటీవల పదోన్నతులు కల్పించారు. సదరు వ్యక్తి ముందుగానే అర్హుల జాబితాను అధికారుల వద్ద నుంచి ప్రజాప్రతినిధి పేరిట తీసుకున్నారు. వారితో మాట్లాడి పదోన్నతులు కల్పిస్తున్నట్లుగా తెలిపారు. ఇటీవల పలువురు ఆయాలకు టీచర్లుగా పదోన్నతులు లభించాయి. కొంతమందికి ఫోన్ చేసి ఐసీడీఎస్‌లోని ఓ అధికారికి డబ్బులు ఇవ్వాల్సి ఉందని వారి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు డబ్బులు ఇవ్వకపోతే భవిష్యత్తులో ఇతర పనులు ఉంటాయని బెదిరిస్తున్నాడు. ప్రజాప్రతినిధి వద్ద పనిచేసే వ్యక్తి కావడం, అధికారి పేరిట డబ్బులు డిమాండ్ చేయడంతో విధి లేని పరిస్థితుల్లో కొంత మంది కొంత నగదు ముట్టజెప్పినట్లుగా సమాచారం. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు ఆపై వారికి తోచినంత ఇవ్వాలని డిమాండ్ చేసినట్లుగా బాధిత అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. ఈ విషయం బయటకు చెబితే తాము ఇబ్బంది పడాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. సమగ్రంగా విచారణ జరిపిస్తే అన్ని ఆధారాలు బయటపడి సదరు వ్యక్తి నిర్వాకం వెల్లడయ్యే అవకాశముంది. కాగా, ఈ విషయమై జిల్లా సంక్షేమాధికారి మిల్కాను వివరణ కోరగా ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. డబ్బులు డిమాండ్ చేసినట్లయితే తమ దృష్టికి తీసుకురావడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.


రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రితోపాటు ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. శివాజీచౌక్‌కు చెందిన బారడి రవికాంత్ తన ఇద్దరు పిల్లలను ఉదయం పాఠశాలలో వదిలిపెట్టేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా మరో వ్యక్తి బైక్‌పై అతివేగంతో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రవికాంత్‌తోపాటు ఆయన పిల్లలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. బైక్ ఢీకొట్టిన వ్యక్తి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ఇచ్చోడ ఎంఈవోకు షోకాజు నోటీసు

- రాగి జావ సరఫరాలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం

ఆదిలాబాద్‌టౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇచ్చోడ ఎంఈవోపై కలెక్టర్ రాజర్షి షా ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమ నిర్వహణపై ఎంఈవోలు, నోడల్ ఉపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిజావ తాగుతున్నారా.. రుచి ఎలా ఉంది అంటూ కలెక్టర్ విద్యార్థులను అడిగారు. దీంతో ఇచ్చోడ మండలంలోని ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ తమకు రాగి జావ ఇవ్వడం లేదని వివరించారు. ఎంఈవో, ఉర్దూ పాఠశాలలో రెగ్యులర్ హెచ్‌ఎంగా పనిచేస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. సదరు ఎంఈవో కాసావాత్ బిక్కుకు షోకాజు నోటీసు జారీ చేస్తూ డీఈవో ఖుష్బూగుప్తా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై ఒక్కరోజులోగా వివరణ ఇవ్వాలని సూచించారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లుగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.


MEMO
డీఈవో జారీ చేసిన షోకాజు నోటీసు